మహాగాంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, జడ్పీ చైర్పర్సన్ కోవ లక్ష్మి

అడుగడుగునా నీరాజనం

- నియోజకవర్గాల్లో జోరుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారం
- ఆసిఫాబాద్‌లో కోవ లక్ష్మి, సిర్పూర్‌లో కోనప్ప పర్యటన
- సర్కారు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తూ ముందుకు..
- కాంగ్రెస్, బీజేపీల బూటకపు మాటలు నమ్మి మోసపోవద్దని సూచన
- సాధించిన ప్రగతిని చూసి పట్టం కట్టాలని పిలుపు

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు కోవ లక్ష్మి, కోనేరు కోనప్ప విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు అడుగడుగునా వారికి నీరాజనం పలుకుతున్నారు. బుధవారం వాంకిడి మండలం దాబా, మహాగాం, గోయగాం, రాజుల గూడ, చిన్నుగూడ, మోకాసిగూడ, సోనాపూర్, దొడ్డిగూడ, చిచుపల్లి, పునగూడ, మచ్చగూడ, రోహిణిగూడ, గణేశ్‌పూర్ గ్రామాలతో పాటు రెబ్బెన మండలం నవేగాం, వంకులం, రాంపూర్, రాళ్లపేట్ గ్రామాల్లో ఎమ్మెల్యే ఆత్రం సక్కు, స్థానిక నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. చింతలమానేపల్లి మండలం నందికొండ, కౌటాల మండలం గుండాయిపేట్ గ్రామాల్లో ఎమ్మెల్యే కోనప్ప ప్రచారం చేశారు.

నందికొండ గ్రామంలో తిలకం దిద్ది కోనేరు కోనప్పను ఆహ్వానిస్తున్న మహిళలు

సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ..

ఈ పేదళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూనే.. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై అవగాహన కల్పిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీల బూటకపు మాటలు నమ్మొద్దనీ, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించే వారికే పట్టం కట్టాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరుతున్నాయన్న విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రైతుబంధు ఎకరానికి రూ. 16 వేలు, పింఛన్లను రూ. 5 వేలకు పెంచడంతో పాటు మహిళలకు రూ. 3 వేల భృతిని అందిస్తుందన్నారు. కేసీఆర్ బీమా పథకంతో ప్రజలందరికీ ఇన్సూరెన్స్ కల్పిస్తామని, రూ. 400లకే గ్యాస్‌సిలిండర్లు అందిస్తామన్నారు. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం ఇవ్వడంతో పాటు అసైన్డ్ భూములపై ఆంక్షలు ఎత్తివేస్తామని తెలిపారు. సాధించిన ప్రగతిని చూసి రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌లో కలవరం

- ఇంకా తేలని టికెట్ల పంచాయతీ
- పోటీ పడుతున్న మర్సుకోల సరస్వతి, గణేశ్ రాథోడ్, శ్యాం నాయక్, శేషరావు
- ఎవరికివారే అభ్యర్థులనంటూ ప్రచారం
- స్పష్టత ఇవ్వని హస్తం పార్టీ.. అయోమయంలో కార్యకర్తలు
- అంతర్గత పోరుతో విస్తుపోతున్న ప్రజలు



ఆసిఫాబాద్, అక్టోబర్18 : ఆసిఫాబాద్ నియోజవర్గంలోని కాంగ్రెస్ పార్టీలో కలవరం మొదలైంది. కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్ర వ్యాప్తంగా 54 మందితో పార్టీ టికెట్లు ఖరారు చేయగా, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గ అభ్యర్థులపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఆసిఫాబాద్ నియోజవర్గం నుంచి మర్సుకోల సరస్వతి, గణేశ్‌రాథోడ్ టికెట్లు ఆశిస్తుండగా, ఇటీవల ఆర్టీసీ ఉద్యోగానికి వీఆర్ఎస్ పెట్టి కాంగ్రెస్‌లో చేరిన అజ్మీరా శ్యాంనాయక్ కూడా పోటీలో ఉన్నాడు. కాంగ్రెస్ పార్టీ తనకే టికెట్ ఇస్తుందని ఇప్పటికే నియోజకవర్గంలో ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నాడు. తనకే టికెట్ కేటాయించాలని వెనుక నుంచి ఆదివాసీ సంఘాలతో ధర్నాలు చేయిస్తూ.. అధిష్ఠానంపై ఒత్తిడి తీసుకువచ్చే పనిలో మర్సుకోల సరస్వతి ఉండగా, మరో నాయకుడు గణేశ్‌రాథోడ్ మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌పై నమ్మకంతో తనకే టికెట్ వస్తుందని గ్రామాల్లో పర్యటిస్తున్నాడు. అలాగే మరో నాయకుడు రాథోడ్ శేషరావు కూడా ఎమ్మెల్యేగా పోటీ చేస్తానంటూ కాంగ్రెస్ కండువాతో పల్లెల్లో తిరుగుతున్నాడు. మొత్తం నలుగురు నాయకులు తమకంటే.. తమకే టికెట్ వస్తుందని ప్రచారం చేస్తుండగా, ప్రజలు విస్తుపోతున్నారు.

అయోమయంలో కార్యకర్తలు

కాంగ్రెస్ అధిష్ఠానం టికెట్ ఎవరికి కేటాయిస్తుందో తెలియక పార్టీ కార్యకర్తలు అందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎవరికి వారుగా విడిపోయి.. ప్రచారం చేస్తున్నారు. టికెట్ కేటాయించిన తర్వాత కాంగ్రెస్‌లో అంతర్గతపోరు మరింత పెరుగుతుందని బాహాటంగా చర్చించుకుంటున్నారు. తన నలుగురిలో ఎవ్వరికి టికెట్ వచ్చినా మిగతా ముగ్గురి కార్యకర్తలు, నాయకులు తమ దారి ఎటోనని అంతర్మథనంలో పడుతున్నారు.

● కాంగ్రెస్ నోట.. బీఆర్ఎస్ పాట..

చేరికల పర్వం

- తిమ్మపూర్ ఉపసర్పంచ్ ముత్తె రాజ్‌కుమార్, సీనియర్ నాయకుడు చంద్రమౌళి చేరిక
- ఇతర పార్టీల వైపు చూస్తున్న హస్తం ఆశావహులు
- లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల్లో కాంగ్రెస్ ఢీలా
- పీఎస్ఆర్ ఒంటిద్దు పోకడలు నచ్చకే పార్టీని వీడుతున్న నాయకులు

కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన లక్షెట్టిపేట కాంగ్రెస్ జడ్పీటీసీ

మంచిర్యాల, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎన్నికల సమర క్షేత్రంలో బీఆర్ఎస్ దూసుకుపోతుంది. ప్రతిపక్ష పార్టీలు అభ్యర్థులు ఎవరో తేల్చుకోలేకముందే బీఆర్ఎస్ పార్టీ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నది. ఈ నేపథ్యంలో మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో కీలకమైన నాయకులుగా ఉన్న లక్షెట్టిపేట కాంగ్రెస్ జడ్పీటీసీ ముత్తె సత్తయ్య తన అనుచరులతో కలసి కరీంనగర్‌లో రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ముత్తె సత్తయ్య చేరికతో మంచిర్యాల నియోజవకర్గంలోని లక్షెట్టిపేట, దండేపల్లి మండలాలలో బీఆర్ఎస్ బలం మరింత పెరిగింది. ముత్తె సత్తయ్యతో పాటు తిమ్మపూర్ ఉప సర్పంచ్ ముత్తె రాజ్ కుమార్‌తో పాటు సీనియర్ నాయకులు సూరం చంద్రమౌళి, అనుచరులు బీఆర్ఎస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ పార్టీ బలహీనపడినట్లయింది. బీఆర్ఎస్ సర్కార్ పాలనకు, కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు ముత్తె సత్తయ్య తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఏక పక్ష విదానాలు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రేమ్ సాగర్ రావు ఒంటిద్దు పోకడలు నచ్చక తాను కాంగ్రెస్ పార్టీ వీడినట్లు తెలిపారు.

బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

మంచిర్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీలోకి ఇక నుంచి భారీగా చేరికలు ఉండనున్నాయి. లక్షెట్టిపేట జడ్పీటీసీ ముత్తె సత్తయ్య కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే టికెట్‌కు ధరఖాస్తు చేసుకున్నాడు. మంచి ఓటు బ్యాంక్ ఉన్న ముత్తె సత్తయ్యను పక్కన పెట్టి, తనతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండా ప్రేమ్ సాగర్ రావుకు అదిష్ఠానం టికెట్ కేటాయించడంతో కాంగ్రెస్ పార్టీని వీడాలని నిర్ణయం తీసుకున్నారు. లక్షెట్టిపేట, దండేపల్లి మండలాలలో మంచి ఓటు బ్యాంక్ ఉన్న ముత్తె సత్తయ్య కాంగ్రెస్ పార్టీ వీడటంతో పార్టీ ఉనికి ఈ రెండు మండలాలలో కాంగ్రెస్ పార్టీ ఉనికి ప్రశ్నార్థకం అయ్యే అవకాశం కనిపిస్తుంది. శుక్రవారం రోజున లక్షెట్టిపేటలో భారీ సభను నిర్వహించి లక్షెట్టిపేట, దండేపల్లి మండలాలకు చెందిన ఎంపీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లను బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన క్యాడర్ మెల్లిమెల్లిగా బీఆర్ఎస్ పాట పడుతుండటంతో మంచిర్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలం మరింత పెరుగుతోంది

కరీంనగర్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిసిన మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్ రావు, నాయకులు

ఇతర పార్టీల వైపు కాంగ్రెస్ ఆశావహుల చూపు

కాంగ్రెస్ పార్టీ నుండి టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు ఇతర పార్టీలలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది నేతలు అధికార పార్టీ బీఆర్ఎస్‌లో చేరేందుకు టచ్‌లోకి వెళ్ళినట్లు సమాచారం. బీఆర్ఎస్ పార్టీ వైపుకు మెజార్టీ నేతలు చూస్తుండగా, మరి కొంత మంది నేతలు ఇతర పార్టీలో చేరి ప్రేమ్ సాగర్ రావుకు వ్యతిరేఖంగా పనిచేయాలని నిర్ణయానికి వచ్చారు. కాంగ్రెస్ పార్టీ క్రమక్రమంగా తగ్గుతుండటంతో ఉన్న నేతలు కూడా తమదారి తాము చూసుకుంటున్నారు. బీఆర్ఎస్ జోరు పెరుగుతుండంతో మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ఢీలా పడిపోయిందని చెప్పవచ్చు.

పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రం

- సీ-విజిల్ యాప్‌ను రూపొందించిన ఈసీ
- ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అనుసంధానం
- అక్రమాలు, కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదుకు అవకాశం
- నిమిషాల వ్యవధిలోనే చర్యలు

ఆసిఫాబాద్,అక్టోబర్18 : అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం రూపొందించిన సీ-విజిల్ యాప్ పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రంగా మారింది. ప్రస్తుతం ఈ యాప్‌ను ఆధునీకరించడంతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అనుసంధానం చేసింది. అక్రమాలకు సంబంధించిన ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేస్తే 100 నిమిషాల వ్యవధిలో దర్యాప్తు చేసిన ఫిర్యాదుదారుడికి సమాచారం ఇస్తారు. ఈ సమాచారం జిల్లా ఎన్నికల అధికారితో పాటు నియోజకవర్గ పరిధిలోని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు చేరుతుంది. ఎవరైనా కోడ్ ఉల్లంఘించినా.. రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు ప్రలోభాలకు గురిచేసినా ఈ వివరాలను నేరుగా యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. అలాగే ఎన్నికల ప్రచారంలో అనుమతులు లేకుండా లౌడ్ స్పీకర్ వాడడం, ఇతర నిబంధనలు ఉల్లఘించినా, కుల, మతాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, ర్యాలీలు తీసినా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేసిన తర్వాత 10 నిమిషాల్లో అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని 100 నిమిషాల వ్యవధిలో దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటారు.

యాప్‌తో నేరుగా ఫిర్యాదు..

స్మార్ట్ ఫోన్లలో సీ-విజిల్ యాప్ ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి కోడ్ ఉల్లంఘనలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. స్మార్ట్ ఫోన్లలోని ప్లే స్టోర్‌లో సీ-విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అనంతరం భాషను ఎంపిక చేసుకొని టిక్ చేయమని సూచిస్తుంది. అనంతరం ఈ యాప్ మీ స్మార్ట్ ఫోన్‌లో స్క్రీన్‌పై దర్శనమిస్తుంది. ఆ తర్వాత సెల్ ఫోన్ నంబర్ ఎంటర్ చేయమని సూచిస్తుంది. సంబంధిత సెల్ నంబర్‌కు కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఆఫ్ ఇండియా నుంచి ఎస్ఎంఎస్ ద్వారా నాలుగు అంకెల నంబర్ వస్తుంది. ఈ నంబర్‌ను సెల్ ఫోన్‌లో ఎంటర్ చేసిన అనంతరం విని యోగదారుడికి సంబంధించిన పూర్తి వివరాలు పొందుపర్చబడతాయి. అనంతరం మీ ఫోన్‌లో యాప్ ఓపెన్ అవుతుంది.మీ పరిధిలోని కోడ్ ఉల్లంఘనపై ఫొటో లేదా వీడియోలు యాప్‌లో అప్‌లోడ్ చేస్తూ ఫిర్యాదు అందినా తర్వాత 10 నిమిషాల్లో ఎన్నికల అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని 100 నిమిషాల్లో దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటారు.తప్పుడు సమాచారం ఇచ్చినా.. పాత ఫొటోలతో లేదా మార్పింగ్ చేసినా ఫిర్యాదు దారుడిపై చర్యలు తీసుకుంటారు.

సీ-విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులను పలిశీలిస్తున్న ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్

సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయొచ్చు

జిల్లాలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. సీ-విజిల్ యాప్‌ను అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. 1950,08733-279411 నంబర్లకు కాల్ చేసి కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- హేమంత్ సహదేవరావు, జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్

మహిళలకు వరం.. సౌభాగ్యలక్ష్మి

బీపీఎల్ కుటుంబాల మగువలకు గౌరవ భృతి రూ.3000

- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో చేర్చడంపై అతివల ఆనందహేల
- సీఎం కేసీఆర్ సార్ మాట ఇస్తే నెరవేరుస్తాడని వ్యాఖ్య

ఆదిలాబాద్, అక్టోబర్ 18(నమస్తే తెలంగాణ) : మహిళ సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. కుటుంబాల పోషణలో మహిళల పాత్ర కీలకం కావడంతో వారి పేరిట పలు సంక్షేమ పథకాలను అందజేయడంతో పాటు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తుంది. మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ చేస్తూ వారు వివిధ రంగాల్లో వ్యాపారులు చేసుకునేలా చేయూతనందిస్తుంది. మహిళలు రాజకీయాలలో రాణించేలా వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుంది. ఒంటరి మహిళలకు, వింతకుతువులకు, బీడీ కార్మికులకు ప్రతి నెల పింఛన్లు మంజూరు చేస్తూ వారికి ఆర్థిక సాయం అందిస్తుంది. మహిళా సంఘాల సభ్యులు వడ్డీలేని రుణాలు తీసుకుంటూ వ్యాపారులు చేస్తూ వారి ఉపాధిని మెరుగుపర్చుకుంటున్నారు. కేసీఆర్ కిట్‌లు, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌లు, అమ్మఒడి, ఆరోగ్యలక్ష్మీ, గృహలక్ష్మీ, సఖీ కేంద్రాలు, పేదింటి ఆడపిల్లల వివాహాలకు సాయం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ లాంటి పథకాలు మహిళలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తున్నారు. మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన షీం టీంలు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఇప్పటికే పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుండగా ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదలు చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలో మహిళలు మరింత ప్రాధాన్యం లభించింది. సౌభాగ్యలక్ష్మీ పథకంలో భాగంగా అర్హులైన పేదకుటుంబాల మహిళలకు ప్రతి నెల రూ.3 వేల గౌరవభృతి అందజేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. బీఆర్ఎస్ సర్కారు అందించే ఈ సాయం వారికి ఎంతో ఉపయోగపడుతుంది. కుటుంబాల పోషణలో భాగంగా అవసరాల కోసం, ఇతర ఖర్చులకు సౌభాగ్యలక్ష్మీ పథకం డబ్బులు ఎంతో ఉపయోగపడుతాయని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నో పథకాల ద్వారా వివిధ రంగాల్లో మహిళలకు చేయూతనందిస్తున్న బీఆర్ఎస్ సర్కారు మరో పథకం తీసుకురావడం సంతోషకరమైన మహిళలు అంటున్నారు.

మహిళలపై గౌరవం..

కాసిపేట, అక్టోబర్ 18 : బీఆర్ఎస్ సర్కారు మ్యానిఫెస్టో బాగుంది. ముఖ్యంగా మహిళల కోసం సౌభాగ్య లక్ష్మి పేరిట ప్రతి నెలా రూ. 3 వేలు ఇస్తామని ప్రకటించారు. ఇందుకు చాలా ఆనందంగా ఉంది. పేద మహిళలపై సీఎం కేసీఆర్‌కు ఉన్న గౌరవమే ఈ పథకం. రాబోయేది మళ్లా బీఆర్ఎస్ ప్రభుత్వమే. మాకు గౌరవ భృతి రావడం ఖాయం.

- కొరకొప్పుల రమ, కాసిపేట

అల్లరి

ALLARI

చెప్పుకోండి

1. సౌర వ్యవస్థలో అత్యంత బరువైన గ్రహం ఏది?
2. భారతదేశంలో అతిపెద్ద పరిశ్రమ ఏది?
3. భారతరత్న పొందిన మొదటి భారతీయ మహిళ ఎవరు?

పద్నాలుగు

కింద ఇచ్చిన పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Friendly

Ex : End

చెప్పండి చూద్దాం

కష్టాలు అనుభవించాక వచ్చే విజయాలు ఎంతో తృప్తినిస్తాయి.

● ఏపీజే అబ్దుల్ కలాం

ఎంగ్ ట్విస్టర్స్

Pad kid poured curd pulled cod.

ఉత్తమ విద్యార్థి

కథ

కొత్తపేట ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న విద్యార్థికి 'ఉత్తమ విద్యార్థి పురస్కారం' ఇవ్వడం ఆనవాయితీ. అయితే, ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో రాజు, రాము.. ఇద్దరికీ మొదటి మార్కులు సమానంగా వచ్చాయి. ఎవరికి 'ఉత్తమ విద్యార్థి పురస్కారం' ఇవ్వాలనేది ప్రధానోపాధ్యాయుడు మాధవరావుకు అర్థం కాలేదు. దాంతో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటుచేశాడు. ''ఈ ఏడాది ఇద్దరు విద్యార్థులూ సమానంగా మార్కులు తెచ్చుకున్నారు. వారిలో ఎవరికి 'ఉత్తమ విద్యార్థి పురస్కారం' ఇవ్వాలనే విషయంపై ఒక నిర్ణయానికి వచ్చాను. అది ఏమిటంటే.. ఒక వారం రోజులు ఇద్దరు విద్యార్థులూ కూడా ఉదయం పల్లె ప్రకృతి వనంలో మొక్కలకు నీళ్లు పోయాలి. మధ్యాహ్నం వృద్ధాశ్రమంలో భోజన సేవలో పాల్గొనాలి. సాయంత్రం గ్రంథాలయాన్ని సందర్శించాలి. ఈ మూడు పనులూ క్రమం తప్పకుండా చేసిన వారిని 'ఉత్తమ విద్యార్థి'గా ఎంపిక చేద్దాం. ఈ విషయం వారి తల్లిదండ్రులకూ తెలియచేస్తాను!'' అన్నాడు. దానికి అందరూ ఏకీభవించారు. మాధవరావు ఈ విషయాన్ని రాజు, రాముతో పాటు వారి తల్లిదండ్రులకు తెలియచేశాడు. వారం గడిచింది. ఆ తర్వాత, ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటుచేశాడు మాధవరావు. ''మనం అనుకున్నట్లుగానే ఆ ఇద్దరు విద్యార్థులు మూడు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయితే, రాము మాత్రమే ఉత్తమ విద్యార్థి పురస్కారానికి అర్హత సాధించాడు!'' అని ప్రకటించాడు. ''ఇద్దరూ హాజరైతే.. రాము ఒక్కడే ఎలా అర్హత సాధించాడు సార్?'' కుతూహలంగా అడిగారు టీచర్లంతా. ''నేను మారువేషంలో ఇద్దరినీ ప్రత్యక్షంగా పరిశీలించి ఈ నిర్ణయానికి వచ్చాను. మొదటగా వారంరోజులపాటు ఉదయంపూట తోటమాలి వేషంలో ప్రకృతి వనానికి వెళ్లాను. అక్కడ రాజు కాసేపు ఆటలు ఆడుకున్నాడు. రాము మాత్రం శ్రద్ధగా మొక్కలకు నీళ్లు పోశాడు. మధ్యాహ్నం వృద్ధుడి వేషంలో వృద్ధాశ్రమానికి వెళ్లాను. అక్కడ భోజనాల మధ్యలో కూర్చున్నాను. రాజు పిచ్చాపాటి మాటలతో గడిపాడు. రాము మాత్రం వృద్ధులకు భోజనాలు పెడుతూ, వారితో ప్రేమగా మాట్లాడుతూ గడిపాడు. సాయంత్రం అటెండర్ వేషంలో గ్రంథాలయానికి వెళ్లాను. రాజు సినిమా పత్రికలు చూస్తూ గడిపాడు. రాము మాత్రం విజ్ఞాన గ్రంథాలు చదువుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. బట్టీ పట్టే మార్కులు తెచ్చుకోవడం తెలివితేటలకు, విలువలకు కొలమానం కాదు. వృద్ధుల పట్ల ప్రేమ, పర్యావరణంపై బాధ్యత, పుస్తకాల్లోని సమాచారాన్ని విజ్ఞానం కోసం ఉపయోగించుకోవాలనే ఉత్సుకత.. ప్రతి విద్యార్థికీ ఉండాలి. అవి రాములో స్వతహాగానే ఉన్నాయని నేను ప్రత్యక్షంగా గమనించాను. కాబట్టి, ఈ ఏడాది రామును 'మన పాఠశాల ఉత్తమ విద్యార్థి'గా ప్రకటిస్తున్నాను'' అని మాధవరావు చిరునవ్వుతో చెప్పగానే.. ఉపాధ్యాయులంతా చప్పట్లు కొట్టారు.

● కయ్యూరు బాలసుబ్రమణ్యం

ఆ ఏమేంటి?

ఇచ్చిన అక్షరాలతో పదాలను పేర్చండి

R B A E R L

జవాబులు

1. బుగ్గలు, 2. బస్సు పరుపు, 3. బంగారుగుండం, 4. బాణం

గుర్తుకోండి

కింది బొమ్మ సరైన నీడ ఏదో కనుక్కోండి



పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా: zindagi@ntnews.com